# సమానత్వం

— పి. పూర్ణశ్రీ

మూడో మరదలు పెళ్ళి నిర్ణయమైందని తెలిసిన సుధాకర్ చాలా ఆనందపడ్డాడు.

సుధాకర్ మామగారికి నలుగురు కూతుళ్ళు. సుధాకర్ భార్య రాణి పెద్ద కూతురు. సుధాకర్, రాణిల వివాహం చాలా అట్టహాసంగా జరిగింది. ఒక లక్షన్నర రూపాయిల కట్నంతో రాణి సుధాకర్‌కు భార్య అయింది. సుధాకర్ ఇంజనీరు, మంచి ఉద్యోగం. రాణి, సుధాకర్‌ల సంసార నౌక ఒడుదుడుకుల్లేకుండా సాగిపోతున్నది.

రాణి చెల్లెలు రత్న. అక్క పెళ్ళి అయిన రెండు సంవత్సరాలకు రత్న వివాహం రాజశేఖర్‌తో కుదిరింది. రాజశేఖర్ డాక్టరు. దానితో అతని రేటు 50 వేలు పెరిగింది. కట్నం రెండు లక్షలు. సుధాకర్‌కు ఇది నచ్చలేదు. తనకంటే ఎక్కువ కట్నం ఇచ్చి తనని చిన్నబుచ్చినట్టు కదా అని అన్నాడు భార్యతో. ఈవిషయం మీద రెండు రోజులు చర్చలు జరిగాయి వాళ్ళిద్దరి మధ్య. చర్చల సారాంశాన్ని రాణి తండ్రికి లేఖ ద్వారా తెలియజేసింది. దానికి రాణి నాన్న గారు పెద్దల్లుడిని చిన్నబుచ్చటం అనే ప్రశ్న లేదు అంటూ వ్రాసిన లేఖతో పాటు 50 వేల రూపాయిల చెక్కు, శుభలేఖ పంపిస్తూ రత్న పెళ్ళికి పది రోజులు ముందుగా రమ్మని వ్రాశారు. సుధాకర్ సంతోషానికి అవధులు లేవు. పెద్ద మరదలి పెళ్ళి సంబరాలు ముగిసిం తర్వాత "మీ రెండో చెల్లాయి పెళ్ళి ఎప్పుడు చేస్తారో మీ నాన్న" అంటూ ఆశగా ఆటపట్టిస్తూండేవాడు రాణిని అప్పుడప్పుడూ. "ఏం మళ్ళీ డబ్బు వస్తుందనా మీ ఆశ" అంటూండేది రాణి. "నేనే డబ్బు కావాలని అడగలేదు మీ నాన్నగారే ఇచ్చారు" అంటూండేవాడు సుధాకర్. మరుసటి సంవత్సరం రెండో మరదలి పెళ్ళి సన్నాహాలు జరుగుతున్నాయనే వార్త సుధాకర్‌కు ఉత్సాహాన్ని తెచ్చింది. పైకి డబ్బు అడగలేదంటున్నా లోలోపల అతను లెక్కలు బాగా వేసుకుంటుంటాడు. రెండో మరదలి పెళ్ళి కూడా అట్టహాసంగా జరిగింది. ఈసారి కట్నం రేటు రెండున్నర లక్షలు. మళ్ళీ ఇద్దరల్లుళ్ళనూ వాళ్ళ మామగారు చెరో ఏభై వేల రూపాయిల చెక్కుతో సాగనంపారు.

ఈ ఫార్ములాతో సంతృప్తి చెందిన ముగ్గురు అల్లుళ్ళు



మరదలి పెళ్ళి కోసం ఎదురు చూస్తున్నారు.

ఆ చిన్న మరదలు పెళ్ళి కూడా త్వరలోనే నిర్ణయించబడబోతుందనే వార్త ముగ్గురు అల్లుళ్ళలోనూ ఆనందాన్ని నింపింది. ఆహ్వాన పత్రికతో పాటు రావాల్సిన చెక్కు రాలేదు, పోనీ పెళ్ళి అయ్యాక ఇస్తాడేమో అనుకొన్న సుధాకర్‌కు ఆ రోజు వచ్చిన లేఖ చూశాక మతిపోయింది. అందులో ఇలా వుంది.

"ముగ్గురు కూతుళ్ళను సమానమైన కట్నంతో సాగనంపగలిగారు. అయితే ఈ నాలుగో అల్లుడు కట్నం తీసుకోడట. ఆదర్శ వివాహం చేసుకొంటాడట. కట్నం ఇవ్వకుండా పెళ్ళి చేస్తే అతడిని చిన్నబుచ్చినట్టు అవుతుంది కదా! నాకేం చేయాలో అర్థం కావడంలేదు. నాలుగో అల్లుడిని చిన్నబుచ్చకుండా మిగిలిన ముగ్గురితో సమానంగా చేసి చూడాలంటే అతను కట్నం అయినా తీసుకోవాలి. లేదా ముగ్గురు పెద్ద అల్లుళ్ళు తీసుకున్న కట్నం తిరిగి అన్నా ఇవ్వాలి. మొదటి నిబంధనకు అతడు తలవంచడట. ఈ సమస్య ఎలా తేలుతుందో తెలీడం లేదు."

"ఇదే ఉత్తరం మిగిలిన అల్లుళ్ళకూ అందింది.

ముగ్గురు అల్లుళ్ళు వివేకం గల వాళ్ళవడంతో ఆలోచనలో పడ్డారు. ■

---

## సమస్యాపూరణం

*11-8-89* సంచికలో ఇచ్చిన సమస్యకు విశేష సంఖ్యలో పూరణలు మాకు చేరినప్పటికీ, క్లుప్తంగా చమత్కారభరితంగా వున్నవి వాటిలో చాలా తక్కువ. విజేతలు ఇరువురినీ అభినందిస్తూ, చెరి పాతిక రూపాయలు బహుమతి మొత్తం పంపే ఏర్పాటు చేస్తున్నాము.

### శ్రావణంలో వరాలలక్ష్మి

* సుబ్బారావు పెళ్ళి చేసుకున్నాడు వరలక్ష్మిని-
ఆమె బారెడు జడ చూసి ముచ్చటపడి!
తెచ్చుకున్నాడు తన ఇంటికి—
శ్రావణంలో (స)వరాలలక్ష్మిని!!

—సుజన, హైదరాబాద్

* అమ్మాయిలు కూడా ఉద్యోగస్థులైన యీరోజుల్లో
ఆగస్టు నెలలో జీతం ప్లస్ బోనస్ అందుకునే
ప్రతి వనితా తన ఆప్తులకి శ్రావణమాసంలో
కానుకలందించే వరాల లక్ష్మే! కాదంటారా?

—ఫణి, కాకినాడ

## రు. 25 గెలుపొందండి

ఈ వారం సమస్య

## వరదలు! వరదలు!!

గడువు తేదీ : సెప్టెంబర్ 7